క్లుప్తంగా

అమ్మవారికి పెన్నులతో అలంకరణ



అమ్మవారికి పెన్నులతో అలంకరణ చేసిన దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటేవారి తోటలోని విజయకనకదుర్గ బాలాత్రిపుర సుందరిదేవి అమ్మవారికి ఆదివారం రెండు వేల పెన్నులతో ప్రత్యేక అలంకరణ చేశారు. సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలలో భాగంగా ఆలయ అర్చకుడు కొమ్ము శ్రీనివాస్ అధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి పెన్నులతో అలంకరణ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పెన్నులను అందజేశారు.

పాత నేరస్తులకు కౌన్సెలింగ్

ఆకివీడు: చీటింగ్, దొంగతనాలు, సెల్‌ఫోన్లు వంటి నేరాలకు పాల్పడకుండా జీవితాన్ని మార్చుకోవాలని డీఎస్పీ పీ.శ్రీనాథ్ హెచ్చరించారు. స్థానిక తెలగపాముల కులాలకు చెందిన పాత నేరస్తులకు ఆదివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా చీటింగ్ కేసులు నమోదవుతున్నాయన్నారు. నేరాలు మాని సత్ప్రవర్తనతో జీవించాలని డీఎస్పీ సూచించారు.

యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారిగా గోపిమూర్తి

సాక్షి, భీమవరం: పట్టణానికి చెందిన బి.గోపిమూర్తి యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికయ్యారు. విజయవాడలో రెండు రోజులు పాటు నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఆదివారం రాష్ట్ర కౌన్సిల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గోపిమూర్తి రెండోసారి రాష్ట్ర కోశాధికారిగా ఎన్నిక కావడంపై పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కడలి గంగిశెట్టికి జెడ్పీ చైర్మన్ కవురు నివాళి



కడలి గంగిశెట్టి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కవురు శ్రీనివాస్

వీరవాసరం: కమ్యూనిస్టు కురువృద్ధుడు కడలి గంగిశెట్టి ఇటీవల మృతి చెందడంతో ఆదివారం జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ నవుడూరులోని ఆయన స్వగృహం వద్ద కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కవురు మాట్లాడుతూ సమాజ సేవ, సమాజ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేసిన మంచి మనిషి కడలి గంగిశెట్టి అని కొనియాడారు. తొలుత కడలి గంగిశెట్టి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కోడి అప్పారావు, కడలి మృత్యుంజయుడు ఉన్నారు.

మల్టీపర్పస్ రుణాలతో రైతులకు లబ్ధి

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- ఉండిలో రైతులకు చెక్కుల పంపిణీ



ఉండిలో లబ్ధిదారులకు రుణాల చెక్కులు అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: సహకార బ్యాంకుల ద్వారా రైతులకు అందిస్తున్న మల్టీపర్పస్ (ఎంపీసీసీ) రుణాలతో రైతులకు మరింత లబ్ధి చేకూరుతుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఆదివారం ఉండి కో–ఆపరేటివ్ రూరల్ బ్యాంక్‌లో త్రిసభ్య కమిటీ చైర్మన్ పేరిచెర్ల సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో మల్టీపర్పస్ రుణాల చెక్కులను పీవీఎల్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీసీబీ ద్వారా రైతులకు మరింత సహకారం అందించాలనే ఉద్దేశంతో తానే స్వయంగా మల్టీపర్పస్ రుణాలను అందించాలని తీర్మానించినట్లు తెలిపారు. దీని ద్వారా రైతులకు గతంలో కంటే ఎక్కువ మొత్తంలో రుణాలు అందిస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి రైతుకు ఎకరాకు రూ.8 నుంచి రూ.10 లక్షల వరకు మొత్తం ఐదు ఎకరాలకు రూ.40 లక్షల వరకు రుణం అందించే కార్యక్రమాన్ని రూపొందించామని అన్నారు. దీనివల్ల రైతులకు, ఆక్వా రైతులకు ఈ పథకం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఉండి శాఖ పరిధిలో మల్టీపర్పస్ రుణాలకు గాను రూ.5 కోట్లు, రైతు నేస్తం పథకంలో రూ.2 కోట్లు, క్రాప్ లోన్లకు గాను రూ.4 కోట్లు మొత్తం మీద రూ.11 కోట్లు డీసీసీబీ మంజూరు చేసిందన్నారు. రుణాలు తీసుకునే ప్రతి ఒక్కరూ బాధ్యతగా తిరిగి చెల్లిస్తేనే సహకార బ్యాంకులు అభివృద్ధి బాటలో ఉంటాయన్నారు. అతి తక్కువ వడ్డీతో రైతుల అభివృద్ధికి పాటుపడుతున్న సహకార బ్యాంకులకు రైతులు వెన్నంటి ఉండాలన్నారు. మల్టిపర్పస్ రుణాలు 16 మందికి రూ.1 కోటి 51 లక్షల 50 వేలు ప్రస్తుతం మంజూరు కాగా, వాటిలో ఆరుగురికి రూ.66.50 లక్షలు, రైతు నేస్తం కింద రూ.8.95 లక్షలు మంజూరు కాగా వాటిలో ఒక్కరికి రూ.6 లక్షల చెక్కులు అందజేసినట్లు తెలిపారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, త్రిసభ్య కమిటీ సభ్యులు చైర్మన్ పేరిచెర్ల సూర్యనారాయణరాజు, సభ్యులు కరిమెరక శివనాగరాజు, చిట్టూరి రత్నరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, కరిమెరక మల్లికార్జున, కమతం బెనర్జీ, కలిదిండి సీతారామరాజు, ఆకివీడు బ్రాంచ్ మేనేజర్ షాయినీ, ముదునూరి సుబ్బరాజు, మునుకోలు సింహాచలం, గిరడ శ్రీను, మల్లువలస సత్యనారాయణ, బ్యాంకు కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

సర్రాజు సేవలు మరువలేనివి



సర్రాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీవీఎల్, రామరాజు తదితరులు

కాళ్ల/ఆకివీడు: రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు పార్టీకి, ప్రజలకు చేసిన సేవలు మరువలేమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు అన్నారు. జక్కరంలో సర్రాజు నివాసం వద్ద ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ అభివృద్ధికి సర్రాజు ఎంతో కృషి చేశారని స్పష్టం చేశారు. ఉండి నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేసేవారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సర్రాజు కుమారులు పాతపాటి శ్రీనివాసరాజు, యుగంధర్ వర్మ, వేగేశ్న సూర్యనారాయణరాజు, దంతులూరి కోటేశ్వరరాజు, వేగేశ్న జయరామకృష్ణంరాజు, సాగిరాజు హరివర్మ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామ దేవతల దీవెనలే కొండంత అండ



వద్దిగూడెంలో నూకాలమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

ఆకివీడు: గ్రామ దేవతల దీవెనలు మెండుగా ఉంటే ఉన్నత స్థితికి చేరుకోవచ్చని, గ్రామం, గ్రామ ప్రజలు అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లతారని శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని కొల్లేరు తీరంలోని చినమిల్లిపాడు గ్రామంలోని వద్దిగూడెం గ్రామ దేవత నూకాలమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. జాతర సందర్భంగా అమ్మవారికి నైవేద్యాలు, పిండి వంటలు సమర్పించారు. గ్రామ మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. మహిళలతో పాటు వెంకట రమణ ఊరేగింపులో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న తరువాత ఆయన మాట్లాడుతూ కొల్లేరు గ్రామాల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో మాట్లాడతానని చెప్పారు. పండుగ వాతావరణంలో అమ్మవారి జాతర జరుపుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం వెంకట రమణను గ్రామ సర్పంచ్ గురుదాసు సీతా బాలాజీ ఘనంగా సత్కరించారు.

14 నుంచి రాజకీయ ప్రచార భేరి

సాక్షి, భీమవరం: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రాజకీయ ప్రచార ఉద్యమ భేరి నిర్వహిస్తున్నట్టు సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు కోనాల భీమారావు, బి.బలరాం ప్రకటించారు. పట్టణంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా పేదలకు వ్యతిరేకమైన విధానాలు అమలు చేస్తోందన్నారు. ప్రజా సంక్షేమానికి కోతలు, రైతుల రాయితీల కుదింపు, వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకానికి సైతం కోతలు విధించిందని ఆందోళన వ్యక్తం చేశారు. విమాన ఇంధన ధరలు తగ్గించి, పేదలు నిత్యం ఉపయోగించే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు మాత్రం విపరీతంగా పెంచారని మండిపడ్డారు. ఈ నెల 14న బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా అయన విగ్రహాలకు పూలమాలలు వేసి రాజకీయ ప్రచార ఉద్యమ భేరిని ప్రారంభిస్తామన్నారు. ఈ యాత్రల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను సభలు, సమావేశాలు పెట్టి వివరిస్తామన్నారు. నాయకులు చెల్లబోయిన రంగారావు, కేతా గోపాలన్, బి.వాసుదేవరావు, కవురు పెద్దిరాజు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

భీమవరం అర్బన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి బి.వినాయకుడు ఆదివారం చెప్పారు. మండలంలో గూట్లపాడు, అనాకోడేరు, దిరుసుమర్రు, తుందుర్రు,చినఅమిరం గ్రామాలలో జిల్లా పరిషత్ హైస్కూళ్లను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశామని, ఈ నెల 3 నుంచి 18 వరకు జరిగే పరీక్షలకు 658 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసి పరీక్ష కేంద్రానికి చేరుకోవచ్చన్నారు. అరగంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని పరీక్షా సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి పంపించేది లేదని హెచ్చరించారు.

ఉణుదుర్రులో అన్నసమారాధన

ఉండి: శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉణుదుర్రులో ఆదివారం అన్నసమారాధనను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ప్రారంభించారు. తొలుత సీతారాములను దర్శించుకుని అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పీవీఎల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలన్నారు. ఆలయ చైర్మన్ నడింపల్లి నర్సింహరాజు, సర్పంచ్ పిన్నంరాజు నాగలక్ష్మీ, వైఎస్సార్ సీపీ నాయకులు జి.సుందర్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు అల్లూరి మాధవి, కూనపరాజు వర్మ, పైలా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల జాతర

వీరవాసరం: రాయకుదురులో వేంచేసి ఉన్న శ్రీపోతురాజుస్వామి, మానసాదేవి సహిత శ్రీ మావుళ్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో, బాణసంచా కాల్పుల మధ్య అమ్మవార్ల ఊరేగింపు జరిగింది. తొలుత శ్రీ మావుళ్లమ్మ మహాలక్ష్మమ్మ వాళ్ల గరగలను మానసాదేవి, పోతురాజుస్వామి వార్ల ఆలయానికి తీసుకువచ్చి అనంతరం గరగోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పట్టణాభివృద్ధికి విష్ణురాజు సేవలు భేష్



భీమవరంలో విష్ణురాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తదితరులు

సాక్షి, భీమవరం: పట్టణ అభివృద్ధికి తమ వంతుగా బీవీ రాజు విద్యాసంస్థల చైర్మన్ విష్ణురాజు అందిస్తున్న సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నిర్వహించిన బీవీ రాజు పార్కు పునరుద్ధరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలను దత్తత తీసుకుని వాటిని అభివృద్ధి చేయడంతో పాటుగా భీమవరానికి మణిహారంగా విష్ణు విద్యా సంస్థలను తీర్చిదిద్దారన్నారు. పార్కును అన్ని వసతులతో సుందరీకరణ చేయడంతో పాటు ఐదేళ్ల నిర్వహణ బాధ్యతను కూడా విష్ణురాజు తీసుకోవడం అభినందనీయమన్నారు. పట్టణంలో దీర్ఘకాలిక సమస్యగా ఉన్న డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు తాను ఎంతో కృషి చేస్తున్నానని, అయితే ఇందుకు ప్రజల నుంచి సహకారం అందకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మన భీమవరం అని ప్రజలు అనుకుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పట్టణ అభివృద్ధికి తమ వంతుగా సహకరిస్తున్న విష్ణు రాజును వాకర్స్ అసోసియేషన్‌తో పాటుగా ప్రజలు కూడా సత్కరించడం ఎంతో సంతోషకరమన్నారు. నూతనంగా ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లాకు భీమవరం కేంద్రాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహకారంతో సాధించామన్నారు. భీమవరం మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా ఉన్న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పట్టణాన్ని సుందరీకరణగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేస్తున్నారన్నారు. విష్ణు రాజు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. దేశంలోనే విద్యాపరంగా భీమవరంలోనే ఎక్కువ ర్యాంకులు సాధిస్తున్న విద్యార్థులు ఉన్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, స్వర్ణ భారతి ట్రస్ట్ చైర్మన్ దీపా వెంకట్, మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, బీజేపీ రాష్ట్ర నాయకుడు భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ కొటికలపూడి గోవిందబాబు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ విష్ణురాజును ఘనంగా సత్కరించారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, జేసీఎస్ త్రీటౌన్ కన్వీనర్ చెల్లబోయిన సూర్య ప్రకాష్, గంటా సుందర్‌కుమార్, కట్రెడ్డి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ల అభివృద్ధికి చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: నియోజకవర్గంలోని డ్రెయిన్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చెప్పారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో డ్రెయినేజీ శాఖ అధికారులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొవ్వాడ అన్నవరం డ్రెయిన్ ప్రక్షాళన చేసేందుకు రూ.5 లక్షల నిధులను మంజూరు చేయించామన్నారు. అదే మాదిరిగా గునుపూడి సౌత్ డ్రెయిన్ ప్రక్షాళనకు రూ.రెండు కోట్ల నిధులను మంజూరు చేసేందుకు ప్రతిపాదనలను పంపించామన్నారు. నియోజకవర్గంలో 17 మైనర్ డ్రెయిన్ల అభివృద్ధికి రూ.1.20 కోట్లు నిధులను మంజూరు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, ప్రభుత్వం ఈ పనులను వెంటనే ఆమోదిస్తుందన్నారు. త్వరలోనే ఈ పనులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డీఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏఈ లీల ప్రసన్న పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



చినగరువు చెరువులో నీటిని నింపే పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ విజయనరసింహరాజు

భీమవరం అర్బన్: వేసవి దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు చెప్పారు. పెదగరువు పరిధిలోని చినగరువులో మండల పరిషత్ నిధులతో అభివృద్ధి చేసిన రక్షిత మంచినీటి చెరువుకు కాలువ ద్వారా నీటితో నింపే పనులకు ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చుదానికి ప్రస్తుతం ఉన్న మంచినీటి చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడం జరిగిందని, వెంటనే చెరువును నీటితో నింపే పనులను కూడా ప్రారంభించామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మండలంలో ప్రతి పంచాయతీని కూడా సందర్శించి ఆయా గ్రామాలలో రక్షిత మంచినీటి చెరువులలో నీటి సామర్థ్యాన్ని పెంచే విధంగా కృషి చేయాలని ఎంపీపీ ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కనకారావు, సర్పంచ్ రావూరి లాజర్, బందెల శ్యామూల్, పైడి మోషేన్, కారేపల్లి మోహన్ పాల్గొన్నారు.

కళాకారులను ఆదరించడం అభినందనీయం



బొండాడలో మల్లికార్జునరావును సత్కరిస్తున్న కళాకారులు

కాళ్ల: నాటక రంగ కళాకారులను వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ కందుల వెంకట మల్లికార్జునరావు ఆదరిస్తుండటం అభినందనీయమని రంగస్థల కళాకారిణి కిలారి లక్ష్మి అన్నారు. బొండాడలో కందుల లక్ష్మణస్వామి, లక్ష్మీతులసమ్మ దంపతులచే ప్రతిష్ఠించిన భద్రాద్రి శ్రీరామచంద్రస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు. నాటకాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ నాటకంలో చంద్రమతిగా కిలారి లక్ష్మి, హరిశ్చంద్రులుగా కొప్పాడ కొండబాబు, వీఎస్ మాధవలు, నక్షత్రకుడిగా షణ్ముగ జే విజయకుమార్ రాజు, కాలకౌశికుడు వీరబాహుడుగా మారుతిప్రసాద్‌ల నటన ఎంతో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రంగస్థల కళాకారిణి కిలారి లక్ష్మి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నాటక రంగాన్ని ప్రోత్సహిస్తూ కళాకారులను మల్లికార్జునరావు అక్కున చేర్చుకుంటున్నారన్నారు. తమ కళాకారులందరికీ బొండాడ పుట్టినిల్లు వంటిదన్నారు. నాటక రంగం అంతరించిపోతున్న తరుణంలో నాటక రంగానికి ప్రాణం పోస్తూ కళాకారులను గుర్తించి ఎప్పటికప్పుడు సన్మానాలు చేస్తున్నారన్నారు. అనంతరం మల్లికార్జునరావును కళాకారులు ఘనంగా సత్కరించారు. కళాకారులతోపాటు ఉత్సవ కమిటీ సభ్యులను గ్రామ పెద్దలు సుమారు 120 మందిని సత్కరించి మెమెంటోలు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

దాడిలో కానిస్టేబుల్‌కు గాయాలు

కాళ్ల: కానిస్టేబుల్‌పై దాడి చేసి గాయపరిచిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కోపల్లె గ్రామంలో జరుగుతున్న పరాలమ్మ జాతరకు ఏఎస్ఐ సీతారామరాజు, కానిస్టేబుల్ హరికృష్ణ బందోబస్తు నిమిత్తం వెళ్లారు. గ్రామంలో స్థానికంగా కొంతమంది యువకులు ఫ్లెక్సీ కడుతుండగా పైన వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగులుతాయని పోలీసులు చెప్పగా వెనుక నుంచి కడగల రాము అనే వ్యక్తి కానిస్టేబుల్ హరికృష్ణపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ఎస్సై మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



మట్టల ఆదివారం సందర్భంగా పాటలు పాడుతున్న దృశ్యం



ఆకివీడులో ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ చర్చి ఆధ్వర్యంలో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

సాక్షి, భీమవరం: భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో ఆదివారం క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బేతని సండే స్కూల్ చిన్నారులు ఈత మట్టలకు రకరకాల పూలను అలంకరించి భక్తిగీతాలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. సండే స్కూల్ సూపరింటెండెంట్ బి.శ్యామలరాణి మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే ముందు ఆదివారం మట్టల ఆదివారం అని పిలుస్తారన్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పలువురు విశ్వాసులు పాల్గొన్నారు.

ఇవాంజిలికల్ ఫెలోషిప్ చర్చిలో..

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక ది లెమెన్స్ ఇవాంజలికల్ ఫెలోషిప్ చర్చిలో ఆదివారం 'మట్టల ఆదివారం ' ఘనంగా నిర్వహించారు. సండే స్కూల్ పిల్లలు – యవ్వనస్తులు ప్రత్యేక పాటలు పాడారు. ఈ ఆరాధనలో పాస్టర్ జయంతరావు ముఖ్య సందేశం అందించారు. సిస్టర్ నిర్మల జయంత్ అనేక విషయాలు వివరించారు.

ఆకివీడులో..

ఆకివీడు: మానవులలో అహంకారం, ద్వేషం, ఈర్ష్య, అసూయ పోగొట్టేందుకు ఏసుక్రీస్తు గాడిదపై ఊరేగారని ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ టౌన్ చర్చి ప్రతినిధి, రాష్ట్ర సీబీసీఎన్‌సీ కార్యదర్శి గూడపాటి జోసఫ్‌రాజు చెప్పారు. మట్టల ఆదివారం సందర్భంగా స్థానిక జానికమ్మ ఆసుపత్రి నుంచి క్రైస్తవులు పూలతో కూడిన మట్టలను చేతబట్టి జాతీయ రహదారిపై ఊరేగింపు నిర్వహించారు. క్రైస్తవ ప్రతినిధులు గూట్ల ప్రభుదాసు, గోడి ఆనందబాబు, గూట్ల దానియేలు, బొండాడ సుధాకర్, ఏనేపల్లి నాగేశ్వరరావు, పుల్లంకి జీవరత్నం, నక్కా యాకోబు, గూట్ల శేఖర్, దయామణి పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి మట్టలకు పూలు అలంకరించి క్రీస్తు గీతాలు ఆలపిస్తూ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలో పెదఅమి కాళ్ల, బొండాడ, సీసలి, ఏలూరుపాడు, జువ్వలపాలెంతో పాటు ఆయా గ్రామాల చర్చిల్లో పాస్టర్లు, సీఆర్‌లు మట్టల ఆదివారం ప్రాముఖ్యతను తెలియజేశారు. చర్చిల్లో విశ్వాసులు ప్రత్యేక గీతాలు ఆలపించారు.

ఉండిలో..

ఉండి: మట్టల ఆదివారం పండుగను మండలంలో క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి గ్రామాల్లో వందలాది మంది క్రైస్తవులు ఈత మట్టలను వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించి వాటిని పట్టుకుని సంగీత వాయిద్యాలు, డీజే సౌండ్స్‌తో ఊరేగింపు నిర్వహించారు. ఎన్నార్పీ అగ్రహారంలోని ట్రినిటీ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపు కార్యక్రమంలో పేరిష్ పాస్టర్ వీ నెహ్రూ, సంఘ సీఆర్ పాలమూరి కరుణాకర్ మాట్లాడుతూ క్రైస్తవులు అతి పవిత్రంగా నిర్వహించే 40 రోజుల ఉపవాస ప్రార్థనలలో గుడ్‌ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా నిర్వహిస్తామన్నారు. సంఘ పెద్దలు ఆలమూరి శ్యాంబాబు, గుమ్మడి అమృతరావు, చుక్కా శేఖర్, ముత్యం సువర్ణరాజు, చికిలే వెంకట్, చిగురుపాటి కర్నేలు, చర్చి కార్యదర్శి ముత్యం అనిల్ పాల్గొన్నారు.

పాలకోడేరులో

పాలకోడేరు: మట్టల ఆదివారం సందర్భంగా గ్రామాల్లో క్రైస్తవులు, విశ్వాసులు భక్తిశ్రద్ధలతో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామ వీధులలో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇవాంజిలిస్ట్ గోపే సాల్మన్ రాజు మాట్లాడుతూ ఈస్టర్‌కు ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా ఆచరిస్తామన్నారు. సంఘ కాపరులు మనోహర్,సాల్మన్ రాజు,సండే స్కూల్ టీచర్లు నక్కా సునీత, బుడితి కేజియా, నల్లి జాన్, రాజేష్, స్వప్న, సురేష్, ప్రేమ్, లేవి, శిరీష పాల్గొన్నారు.

వైభవంగా ఉమా సోమేశ్వరుని కల్యాణోత్సవం

యలమంచిలి: స్థానిక శ్రీఉమాసోమేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చేగొండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు యలమంచిలి నరేంద్రశర్మ బ్రహ్మత్వంలో దేవేరుల కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. మధ్యాహ్నం ఉమా సమేత సోమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి పుర వీధులలో రథోత్సవం నిర్వహించారు. ఈ రథోత్సవాన్ని ఎంపీపీ రావూరి వెంకటరమణ, వెంకట కోటి మురళీకృష్ణ (బుజ్జి) దంపతులు ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మల్లుల బుజ్జి, తాళ్లూరి అబ్బులు, బర్రే రాంబాబు పాల్గొన్నారు.